



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్



# ప్రజారక్షణభేరికి కదిలిన ఎర్రదండు

◆ నేడు విజయవాడలో సిపిఎం బహిరంగ సభ ◆ మూడు రైళ్లలో కష్టజీవుల పయనం

అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల నుంచి ప్రజారక్షణ భేరి సభకు ఎర్రదండు కదిలింది. సిపిఎం ఆధ్వర్యంలో విజయవాడ నగరంలో బుధవారం జరిగే బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో కష్టజీవులు మంగళవారం సాయంత్రం పయనమయ్యారు. విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో జరిగే సభకు ఇప్పటికే ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ సభకు హాజరవుతున్నారు. సభలో పాల్గొనేందుకు అనంతపురం, సత్యసాయి జిల్లాల నుంచి ప్రశాంతి, కొండవీడు, ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, మహిళలు వెళ్లారు.

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

అసమానతలు లేని అభివృద్ధి కాంక్షిస్తూ అక్టోబర్ 2న రాష్ట్ర సదస్సుతో ప్రజారక్షణభేరి కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ప్రజారక్షణ భేరి యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ప్రాంతల నుంచి మొదలైంది. రాయలసీమ ప్రాంతంలో కర్నూలు జిల్లా ఆదోనిలో ప్రారంభమైంది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ అధ్యక్షతన సాగిన ఈ యాత్రలో రాయలసీమ ప్రాంత వెనుకబాటుతనం, పాలకుల నిర్లక్ష్యం అంశాలను ఎత్తి చూపారు. తాడిపత్రిలో ప్రారంభమైన యాత్ర గుత్తి, పామిడి, అనంతపురం, రాప్తాడు, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి మీదుగా కదిరి నుంచి అన్నమయ్య జిల్లాలోకి ప్రవేశించింది. ఈ యాత్రకు ముందే అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధిపై మేధావులతో చర్చావేదికలు సైతం నిర్వహించారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా స్కూటర్ యాత్రను సైతం అనంతపురం జిల్లాలో చేపట్టారు. ఇంటింటికి కరపత్రాల ద్వారానూ సమగ్రాభివృద్ధిపై చర్చను లేవనెత్తారు.

**ప్రత్యామ్నాయంపై చర్చ**

ఉమ్మడి అనంతపురం జిల్లా వెనుకబాటుకుగల కారణాలతో చెప్పడమే కాకుండా అభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాలను సిపిఎం సూచిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ పేర్కొన్నారు. కరువులకుగల కారణాలను విశ్లేషించడమే కాకుండా ఈ జిల్లాకు సాగునీటి ఆవశ్యకతను ఈ ప్రజారక్షణ భేరి యాత్ర సందర్భంగా ప్రజలకు వివరించే ప్రయత్నం చేసామని ఆయన వివరించారు. ఉన్న వనరులను ఏ రకంగా వినియోగించుకోవచ్చు అన్నది ప్రభుత్వాల ముందు ఉంచామన్నారు. అదే రకంగా ఖనిజ సంపదకు నిలయమైన ఈ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి గురించి కూడా తెలియజేశామన్నారు. నేడు జరిగే రాష్ట్ర స్థాయి సభలోనూ అసమానతలు లేని అభివృద్ధి అంశమే ప్రధానంగా ఉంటుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రధాన అజెండాగా ముందుకు తీసుకురావాలన్నది సిపిఎం ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను ప్రజల ముందు ఉంచనున్నట్లు తెలియజేశారు.



ముదిగుబ్బ రైల్వే స్టేషన్ నుంచి విజయవాడకు వెళ్తున్న కష్టజీవులు

# పకడ్బందీగా వినియోగదారుల రక్షణ చట్టం

## జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్

**ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్**

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని జాయింట్ కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో వినియోగదారుల రక్షణ చట్టం అమలుపై సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో వినియోగదారుల రక్షణ చట్టం అమలవుతున్న తీరుపై సంబంధిత శాఖ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు ఉపయోగపడే విధంగా రూపొందించిన వినియోగదారుల రక్షణ చట్టంపై చైతన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. లోపభూయిష్ట వస్తువులు, అసంతృప్తికరమైన సేవలు, మోసపూరితమైన వాణిజ్య పద్ధతులు వంటి వివిధ రకాల దోపిడీకి వ్యతిరేకంగా వినియోగదారులకు సమర్థవంతమైన భద్రతలను అందించడం వినియోగదారుల రక్షణ చట్టం ప్రధాన లక్ష్యం అన్నారు. వినియోగదారుల రక్షణ మండలి ఆధ్వర్యంలో వినియోగదారులకు మరిన్ని హక్కులు కల్పించడం వాటికి తగినంత ప్రాచుర్యం కల్పించడం కోసం విస్తతంగా చట్టంపై ప్రజలను అవగాహన చేసేందుకు చైతన్య కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కొత్త చట్టం ద్వారా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లను మరింత శక్తివంతంగా చేయడంతో పాటు వాటి పరిష్కారానికి కమిషన్‌లను ఆశ్రయించి సత్వర పరిష్కారం పొందే అవకాశం ఉంటుందన్నారు. లోక్‌ఆదాల తరహా మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకునే వెసులుబాటు కూడా ఉంటుందన్నారు. వినియోగదారులు ఫిర్యాదు చేయాలనుకుంటే తప్పనిసరిగా బిల్లు పొంది ఉండాలన్నారు. జిల్లా స్థాయిలో వినియోగదారుల రక్షణ మండల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇందులో స్వచ్ఛంద సేవా సంస్థలు చురుకైన పాత్ర వహించాలని సూచించారు. వినియోగదారులు మోసపోకుండా వారిని చైతన్యం చేయాల్సిన బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వినియోగదారుల రక్షణ మండలిలోని స్వచ్ఛంద సేవా సంస్థలు ఇతర ప్రతినిధులు తమకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ జిల్లా పౌరసరఫరాల అధికారి ద్వారా చర్యలు చేపట్టి గుర్తింపు కార్డులో మంజూరు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకష్ణ, డిఎంహెచ్ఓ డా॥ఎస్‌వి.కృష్ణారెడ్డి, జిల్లా కొలతలు తూనిక శాఖ అధికారి గౌస్, ఫుడ్ సేఫ్టీ శాఖ శ్రీధర్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ మధుసూదన్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, వినియోగదారుల రక్షణ మండలి సభ్యులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్‌జె. రత్నాకర్

# గవర్నర్‌కు ఆహ్వానం

**ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్**

సత్యసాయి జయంతి వేడుకలకు హాజరుకావాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ ను సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, ప్రతినిధులు ఆహ్వానించారు. మంగళవారం విజయవాడలోని రాజభవన్ లో గవర్నర్ ను కలిసి ఈ మేరకు ఆహ్వానించారు. సత్యసాయి 98వ జయంతి వేడుకలు ఈనెల 23న జరుగుతున్నాయన్నారు. 22న 42వ సత్యసాయి యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుగుతుందన్నారు. స్నాతకోత్సవంలో పాల్గొనాలని అలాగే 23న బాబా జయంతి వేడుకలలో పాల్గొనాలని వారు గవర్నర్‌ను ఆహ్వానించారు. ప్రతి ఏటా నవంబర్ 22న యూనివర్సిటీ స్నాతకోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. తప్పనిసరిగా ఈ వేడుకలలో పాల్గొనాలని గవర్నర్‌ను కోరారు. గవర్నర్ సానుకూలంగా స్పందిస్తూ స్నాతకోత్సవానికి జయంతి వేడుకలకు ప్రశాంతి నిలయంలో హాజరవుతానని హామీ ఇచ్చినట్లు ట్రస్టు వర్గాలు తెలిపాయి. గత నెలలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ను ఆహ్వానించిన సంగతి తెలిసిందే. గవర్నర్ ను ఆహ్వానించిన వారిలో ట్రస్టు ప్రతినిధులు నాగనంద్, చలం, లక్ష్మణ్ రావు తదితరులు ఉన్నారు.

# చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయం

**ప్రజాశక్తి - హిందూపురం**

సమాజంలో ప్రజలు ఎదుర్కోంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావాడంతో పాటు చిన్నారులను ప్రోత్సహించడానికి ప్రజాశక్తి దినపత్రిక పిల్లల ప్రత్యేక సంచిక 'చిరుమువ్వలు' తీసుకు రావడం అభినందనీయమని ఎల్‌ఆర్‌జి పాఠశాల హెచ్ఎం ప్రసాద్ అన్నారు. మంగళవారం హిందూపురం రూరల్ మండలం కిరికెర వద్ద ఉన్నా ఎల్‌ఆర్‌జి విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'ప్రజాశక్తి' ప్రచురించిన పిల్లల ప్రత్యేక సంచిక "చిరుమువ్వలు" అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆ పుస్తకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఎఎ సంజీవరెడ్డి, ప్రజాశక్తి విలేకరి షబ్బీర్, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రమణకుమార్, హరినాథ్, విజయ్ భాస్కర్, వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక సంచిక 'చిరుమువ్వలు'ను ఆవిష్కరిస్తున్న ఎల్‌ఆర్‌జి హెచ్ఎం ప్రసాద్

# మినరల్ మాయ.!!

## ◆ అనుమతులు లేకున్నా ప్యాకెట్ల తయారీ ◆ పట్టించుకోని అధికారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

ప్రస్తుత పరిస్థితుల్లో శుద్ధి నీటి వినియోగం ప్రజలకు నిత్యావసరమైంది. గ్రామాలు, పట్టణాల్లో ఎక్కువ మంది నేడు మినరల్ వాటర్‌నే తాగుతున్నారు. ప్రజల అవసరాన్ని ఆసరాగా తీసుకుంటున్న కొందరు వ్యాపారులు మినరల్ పేరుతో జనరల్ నీటిలో రసాయనాలు కలిపి సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల ఆరోగ్యం కంటే వారి లాభాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. నీటిని నామమాత్రంగా శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నారు. పైగా ఒక్కో వాటర్ క్యాన్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు వసూలు చేస్తున్నారు. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఎనిమిదికిపైగా మినరల్ వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయి. వీళ్లంతా నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి వాటిని నిర్వహిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు ఆదిశగా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బిఐఎస్)అనుమతి తప్పనిసరిగా ఉండాలి. తొలుత పంచాయతీ లేదా మున్సిపాల్టీ నుంచి అనుమతులు తీసుకోవాలి. అనంతరం ప్లాంట్లో నీటిని మైక్రోబయాలజీ, కెమిస్ట్ నిపుణులు పరిశీలించాక అక్కడి నీరు శుద్ధజలమే అని వారు ధ్రువీకరించాలి. ఆ తర్వాతే ప్రజలకు సరఫరా చేయడానికి వారికి అనుమతి ఇస్తారు. మరోవైపు ప్లాంట్ నిర్వహణలో అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. పిహెచ్ స్థాయి పదికి తగ్గకుండా చూడాలి. ప్రతిరోజూ నీటిని సరఫరా చేసిన క్యాన్‌లను పోటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రంచేయాలి. నీటిలో లవణ ఖనిజాలు వంటి మినరల్స్ ఎంతశాతం ఉన్నాయో చూసుకున్నాకే ఆ నీటిని విక్రయించాలి. ఈ నిబంధనలను 90శాతం నీటి శుద్ధి కేంద్రాలు కనీస ప్రమాణాలను పాటించడంలేదు. అన్ని నిబంధనలు పాటించిన వారు మాత్రమే నీళ్ల ప్యాకెట్లను తయారు చేసి విక్రయించాల్సి ఉంది. ఎటువంటి అనుమతులు లేకున్నా యథేచ్ఛగా ప్యాకెట్లను తయారు చేసి వాటిని మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఈ ప్యాకెట్లపై నీళ్లు ఎప్పుడు తయారు చేశారు.. ఎన్ని రోజులు కాల వ్యవధి.. అన్నది తప్పనిసరిగా ఉండాలి. ఈ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ప్యాకెట్లలో నీటిని నింపి వాటికి వివిధ రకాల పేర్లు పెట్టి సరఫరా చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తున్న ప్రజలు నీళ్ల ప్యాకెట్లను తాగి అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు దష్టి సారించి వాటర్‌ప్లాంట్‌ల ద్వారా నాణ్యమైన నీరు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్లాంట్‌లో నీళ్ల ప్యాకెట్లు తయారు చేసే యంత్రం



ప్లాంట్‌లో నంది పేరుతో సిద్ధం చేసిన వాటర్ ప్యాకెట్లు

**ఫుడ్ఇన్స్‌పెక్టర్ జిల్లా కేంద్రానికే పరమితం..!**

ఎప్పటికప్పుడు పురపాలక సంఘాలతో పాటు మండల, గ్రామీణ ప్రాంతాల్లో ఆహార పదార్థాలపై తనఖీలు చేసి నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ ఇన్స్‌పెక్టర్ జిల్లా కేంద్రానికే పరమితమయ్యారు. ప్రత్యేకంగా పెనుకొండ డివిజన్‌కు ఫుడ్ఇన్స్‌పెక్టర్ ఉండాలి. ప్రతి రోజూ డివిజన్ వ్యాప్తంగా తనఖీలు చేయాల్సి ఉన్నప్పటికి తనఖీలు చేయడం లేదు. దీంతో వ్యాపారులు తమపై ఎవరూ చర్యలు తీసుకోరు అన్న ధీమాతో పురంలో యథేచ్ఛగా కల్తీ నీళ్ల వ్యాపారం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న పురపాకల సంఘం కమిషనర్, తహశీల్దార్లు మాత్రం నిబంధనలు అతిక్రమించి వాటర్ ప్లాంట్‌లను నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలుతీసుకుంటామని చెబుతున్నారు.

# సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

**ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్**

సత్యసాయిబాబా 98 జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ రత్నప్ప చౌదరి మాట్లాడుతూ జయంతి వేడుకలు సందర్భంగా ఏర్పాట్లను ఒకే కాంట్రాక్టర్ కి ఇవ్వడం సబబు కాదన్నారు. కౌన్సిల్ సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి కాంట్రాక్టర్ పనులను పరిశీలించాలన్నారు. కాంట్రాక్టర్లు అరకొర పనులు చేసి బిల్లులు చేసుకుంటున్నారన్నారు. జయంతి వేడుకలకు దేశ విదేశాల నుంచి నుంచి భక్తులు వస్తుంటారని, పట్టణం పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. తాత్కాలిక టాయిలెట్లు, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎనిమిదో వార్డ్ కౌన్సిలర్ సాయి గీత మాట్లాడుతూ పట్టణ ప్రధాన రహదారి ఇరుపక్కల లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. జానకి రామయ్య సమాధి నుంచి ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదన్నారు. పట్టణంలో ఎక్కడ పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ లక్ష్మీదేవి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : మాజీ ఎమ్మెల్యే


**ప్రజాశక్తి - మడకశిర**

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం ఎం రాయపురం పంచాయతీ పరిధిలోని బంద్రేపల్లి, సిగమతిగట్ట, సోమగట్ట, చెర్లోపల్లి, కులిచే కుంట తదితర గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముందడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గౌడప్ప, సీనియర్ నాయకులు పాండురంగారెడ్డి, గుంట రామకృష్ణారెడ్డి, మారెన్న తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలను నిర్మూలిద్దాం

**ప్రజాశక్తి-హిందూపురం**

సమాజంలో మూఢనమ్మకాలను పారద్రోలేందుకు విద్యార్థులు కృషి చేయాలని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ పిలుపునిచ్చారు. మంగళవారం బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిగి మండల పరిధిలోని కొడిగేనహళ్లి ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏజీపీ శ్రీనివాస్ రెడ్డి, న్యాయవాదులు సిద్దు, సుదర్శన్, కళావతిలు విరాళంగా ఇచ్చిన బూస్ట్ ప్యాకెట్లను పాఠశాల ప్రిన్సిపల్ కరీంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రత్నమ్మ, నవేరా, సంతోషి కుమారి, లోక్ అదాలత్ శారద, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో ప్రిన్సిపల్ రిజ్వాన్‌బాషా



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

# క్రమశిక్షణతో కూడిన విద్యతో భవిష్యత్తు

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

క్రమశిక్షణతో కూడిన విద్య జీవితంలో మంచి భవిష్యత్తును ఇస్తుందని శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రిజ్వాన్ బాషా తెలిపారు.కళాశాలలో మొదటి సంవత్సరపు విద్యార్థులకు స్వాగత వేడుకల సందర్భంగా ఫ్రెషర్స్‌డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిజ్వాజ్‌బాషా మాట్లాడుతూ క్రమశిక్షణకు బాధ్యత కలిగిన చదువుకు తమ కళాశాల పెట్టింది పేరు అని అన్నారు. డిగ్రీ విద్యార్థులకు క్రీడా పోటీలను నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారిని అభినందించి, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో కరీముల్లా, అధ్యాపకులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్యశిబిరం

**హిందూపురం :** రూరల్ మండల పరిధిలోనిచింతల పల్లి గ్రామంలో మంగళవారం వాసవ్య మహిళా మండలి, కుశాల్ హెల్త్ కేర్ క్లినిక్ విప్రో కేర్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో 91 మందికి పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, కుశాల్ ప్రాజెక్టు సిబ్బంది రంగయ్య, లక్ష్మమ్మ, మల్లిక, కృష్ణవేణి, రాధమ్మ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులపై దృష్టి సారించండి : ఎస్పీ

**ప్రజాశక్తి-హిందూపురం**

పోలీసులు పనితీరు మెరుగుపరచుకొని, అక్రమాలకు చెక్ పెట్టాలని పెండింగ్ కేసులపై దృష్టి సారించాలని జిల్లా ఎస్పి మాధవ్ రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హిందూపురం డిఎస్‌పి కార్యాలయంలో వార్షిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో పోలీసుల పనితీరు, రికార్డులు, కేసుల పెండింగ్ వంటి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ఎన్‌డిపిఎస్ కేసులపై ప్రత్యేక దష్టి సారించాలని, ప్రాథమిక స్థాయిలో నిఘా పెంచి, కేసుల దర్యాప్తులో వేగం పెంచాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరతగతిన పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. జిల్లాలో అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా తయారీ స్థావరాలపై పోలీసు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో బందాలతో మెరుపు దాడులు చేసి, సమూలంగా నిర్మూలించడానికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కన్జక్షన్, సిఐలు, శ్రీనివాసులు, రియాజ్ అహ్మద్, వేణుగోపాల్, సిసి రాఘవేంద్ర, ఎస్ఐలు గంగాధర్, కళావతి, పోలీసులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన వార్షిక తనిఖీలో భాగంగా మంగళవారం చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈసందర్భంగా పోలీస్ స్టేషన్ లోని పలు రికార్డులను పరిశ్శీలించారు. మండలంలో నెలకొన్న సమస్యలను మహిళ పోలీసులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది పని తీరుపై ఎస్ఐ గంగాధర్‌తో ఆరా తీశారు. కర్నాటక బార్డర్ కావడంతో మద్యం అక్రమ రవాణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.



కేసుల వివరాలపై డిఎస్‌పితో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి



విరాళం అందజేస్తున్న దాతలు

## విరాళం అందజేత

**మడకశిర :** నియోజకవర్గ పరిధిలోని రొళ్ల మండలం కాలువేపల్లి గ్రామంలో లక్ష్మీ రంగనాథ స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపం అభివృద్ధికి దాతలు విరాళం అందజేశారు. కర్నాటక రాష్ట్రం సిరా తాలూకా తరూరు గ్రామానికి చెందిన సాదా సామాజికవర్గం వారు తమ వంతుగా రూ. 1.03 లక్షలను విరాళంగా అందించినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు రాజన్న, శ్రీ రంగప్ప, తిమ్మప్ప, రమేష్ తెలిపారు.కళ్యాణ మండపం నిర్మాణానికి కర్నాటక ప్రాంత వాసులు కాలెప్ప, శివ శంకర్ రావు, రంగమ్మ, నాగరత్నమ్మ, జయరామప్ప, నాగరాజు, గోపాలకృష్ణ, రంగప్ప, వనజాక్షి తమవంతుగా విరాళం అందించడం పట్ల వారికి కృతజ్ఞతలు చెప్పారు.

### నాణ్యమైన విద్యనందించాలి

**మడకశిర :** గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాల విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాధికారి శ్రీనివాస భాస్కర్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని వివిధ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శివపురం లోని ఎనిమిదవ వార్డు, డి గొల్ల హట్టి, కదిరేపల్లి సెయింట్ ఆన్స్ ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూఉపాధ్యాయులు నాణ్యతతో కూడిన విద్యను అందించాలన్నారు.

### సహకారసంఘం వారోత్సవాలు

**లేపాక్షి:** మండల పరిధిలోని కొండూరు సహకారసంఘం అధ్యక్షులు రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సహకారసంఘం వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు వన్నూరు స్వామి, వ్యవసాయ శాఖ అధికారులు పుష్ప, రఘు, కృష్ణారెడ్డి, రైతు లు తదితరులు పాల్గొన్నారు

### బిసిల ఆత్మీయ సదస్సును విజయవంతం చేయండి

**మడకశిర :** ఈనెల 15 న బుధవారం పుట్టపర్తి లోని శ్రీనివాస కళ్యాణమంటపంలో నిర్వహించే బీసీల ఆత్మీయ సరస్సును విజయవంతం చేయాలని విజయవంతం చేయాలని రాష్ట్ర కుంచిటి ఒక్కలిగ సాధికారిక కన్వీనర్ పాండురంగప్ప కోరారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీల ఆత్మీయ సదస్సును జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### కంటి రెటీనాపై జాగ్రత్త అవసరం

**ధర్మవరం టౌన్ :** కంటి రెటీనా పట్ల అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కంటి వైద్య నిపుణులు, రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్. ఎస్. నరసింహులు పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బిఐకాలనీలో గల మధు కంటి వైద్యశాలలో మంగళవారం ప్రపంచ చక్కెర వ్యాధి వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత బాలల దినోత్సవం, చాచా నెహ్రూ జయంతిని జరుపుకున్నారు. ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు చక్కెర వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రెటీనా పరీక్షలను నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### త్రిలింగ దర్శనానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

**కదిరి టౌన్ :** కార్తీక మాసం పురస్కరించుకొని ప్రతి సోమవారం కదిరి డిపో నుండి త్రిలింగ దర్శనం (యాగంటి, మహానంది, బుగ్గరామలింగేశ్వర స్వామి,తాడిపత్రి)లను ఒకే రోజులో కేవలం రూ.700 దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు కదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్ తెలిపారు. అదే విధంగా అరుణాచలం,స్వర్ణ దేవాలయం, కాణిపాకం దర్శనార్థం ప్రతి ఆదివారం ఉదయం 11.00 గంటలకు బసు సర్వీసును నడుపుతున్నామన్నారు. మరిన్న వివరాలను మార్కెటింగ్ సూపర్‌వైజరు ఫోన్ నెంబర్ 9440974857కి సంప్రదించాలని అసిస్టెంట్ మేనేజరు హరిత తెలిపారు.

### నిష్పక్షపాతంగా ఓటరు జాబితా తయారీ

**పుట్టపర్తి రూరల్ :** ఓటరు జాబితా తయారీలో బూత్ లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పుట్టపర్తి రెవిన్యూ డివిజనల్ అధికారి భాగ్యరేఖ పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ నవీన్ కుమార్, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ నరసింహులు, టిపిఒ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 1.1.24 తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు కలిగిన యువతి యువకులు ఓటరుగా ఆన్ లైన్‌లో గాని, బిఎల్‌ఒల దగ్గర గాని ఫారం 6 లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివిధ పార్టీల నాయకులు ఇచ్చిన అభ్యంతరాలను బిఎల్‌ఒలు విచారించి రిమార్కులు రాయాలన్నారు.



# మట్టివాసన తెలిసిన కవి కోగిర జై సీతారాం



కోగిర జైసీతారాం జయంతి కార్యక్రమంలో పాల్గొన్న కవులు, ప్రముఖులు

**ప్రజాశక్తి రొద్దం**

మట్టివాసన తెలిసిన కవి కోగిర జైసీతారం అని ప్రముఖ ప్రజా కవి ఏలూరి యంగన్న అన్నారు. కవికాకి కోగిర జైసీతారామ్ 99 వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానిక కోగిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కవి జాబిలి చాంద్ బాషా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కోగిర సీతారం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సాహితీ స్రవంతి, సత్యసాయి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు నారాయణ రెడ్డి అధ్యక్షత వహించగాప్రధాన వక్తగా పాల్గొన్న ఏలూరు యంగన్న మాట్లాడుతూ జైసీతారాం మట్టి వాసన తెలిసిన కవి అని అన్నారు. పల్లె మనుషుల మనసెరిగినవాడు, చిన్నతనంలోనే మేకలు కాసి కష్టాలను చవి చూచినవాడు, పల్లె ప్రజల జీవనశైలి తెలిసినవాడు, కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో నివశించిన వాడు అని అన్నారు. కరువు ప్రాంతంలో సాహిత్య బతుకు బండిని లాగిన వాడని చెప్పారు. రాయలసీమ లో పేద ప్రజల మధ్యే ఉంటూ ఆ భాషను, వారి జీవితానుభవాలను పూర్తిగా జీర్ణించుకుని వారికోసం వారి భాషతో కవిత్వం అల్లిన ప్రజాకవి జైసీతారాం అని అన్నారు. తబలా, హార్మోనియం వాద్యకారులు, చిత్రలేఖనంలోను ఆయన ప్రావీణ్యత సాధించారని కొనియాడారు. జి.ర.సం అధ్యక్షులు జాబిలి చాంద్‌బాషా మాట్లాడుతూ పద్యం అంటే సంస్కృత పదబందం కాదని, సాహిత్యం అంటే పాతపురాణాలను వల్లె వేయటం కానే కాదని, నిజ జీవిత పోరాటాన్ని వాడుక పదాలతో పద్యంలో చూపిన పద్య కవి జైసీతారాం అని

### ప్రజాకవి ఏలూరి ఎంగన్న

అనాద్ర.అసలు సిసలైన ఉపాధ్యాయుడు,ఆధునిక భావాలతో సమాజాన్ని జాగృత పరిచిన నిజమైన సాహితీ కారులు, సొంత ఊరిపేరునే ఇంటిపేరుగా మలచుకున్న గొప్ప కవి మన కవి కాకి కోగిర జైసీతారాం అని అన్నారు. సాహితీ స్రవంతి కన్వీనర్ ఎ.హరి,కొగిర జయచంద్ర, శివరాం మాట్లాడుతూ జైసీతారామ్ బాలల దినోత్సవం రోజు నవంబర్ 14 న జన్మించారని, తన బాలగేయాలతో, కవితలతో విద్యార్థులను భావిభారత ఉత్తమ పౌరులుగా మలచడానికి,అటు మెరుగైన సమాజ స్థాపనకు జీవితమంతా కృషిచేశారని అన్నారు. ఇంతటి గొప్ప ప్రజా సాహితీ వేత్త జయంతి సభలో పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఈసందర్భంగా కోగిరి జైసీతారామ్ కుమారులు కోగిర జయచంద్ర అతిథితులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, కోగిర జై సీతారామ్ అభిమానులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేద్దాం

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

జనసేన పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు నాయకులు జనసేన పార్టీలోకి చేరారు. మండలంలోని పోతులనాగేపల్లి గ్రామానికి చెందిన కుల్లంపల్లిరమేష్, మురేప్పగారి శంకర్, కలవగడ్డనరసింహులు, పెద్దినాయుడు, కృష్ణంనాయుడు, రామాంజినేయులు తదితరులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పార్టీ కండువాలు వేసి జనసేన పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార వికాస విభాగం ప్రధానకార్యదర్శి బెస్తశ్రీనివాసులు, కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు ప్యాదిండి వెంకటేష్, నాయకులు వెంకటేష్, కోటికి రామాంజి, బండ్ల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి చేరిన వారితో చిలకం మధుసూదన్‌రెడ్డి

## దళితులను అవమానించడం వైసిపి నైజం : టిడిపి

**ప్రజాశక్తి మడకశిర**

దళితులను అవమానించడమే వైసిపి తన నైజంగా పెట్టుకుందని టిడిపి నియోజకవర్గ డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకు దళితులను అవమాన పరచడమే వైసీపీ నాయకులు తమ విధానంగా మార్చుకున్నారని విమర్శించారు. ప్రతి రోజూ ఎక్కడో ఒకచోట దళితులపై వైసీపీ నాయకులు దౌర్జన్యాలకు దాడులకు దిగుతున్నారన్నారు. సోమవారం కర్నూల్ లో దళిత న్యాయవాదికి జరిగిన అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజ్యాంగబద్ధంగా దళితుల హక్కులను కాపాడటం ప్రభుత్వ బాధ్యతగా గుర్తించాలని అన్నారు.

## టిడిపి, సిపిఐ నాయకుల 'కాలువనిద్ర'

**తలుపుల:** రైతుల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం హంద్రీ నీవా కాలువ పూర్తి చేయడంలో విఫలం చెందిందని టీడీపీ, సిపిఐ నాయకులు విమర్శించారు. హంద్రీనీవా కాలువ పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రాత్రి హంద్రీనీవా కాలుపై నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎద్దుల రాముడు, సిపిఐ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, ఎల్‌వి. రమణ, అస్సాం, అశోక్,, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి నియోజకవర్గంలో బాలయ్య పర్యటన

**ప్రజాశక్తి-హిందూపురం**

స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ బుధవారం నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. బుధవారం పట్టణానికి చేరుకున్న బాలకృష్ణ రాత్రి డిసిఎ ఫంక్షన్ హాల్‌లో జరిగే వివాహ రిసెప్షన్‌ను హాజరవుతారు. అనంతరం వాల్మీకి భవన్‌లో జరిగే మరో శుభ కార్యక్రమంలో పాల్గొంటారు. గురువారం ఉదయం 9 గంటలకు జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తల సమన్వయ సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1 గంటకు బెంగళూరు వెళ్లి అటు నుంచి హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే



నల్లచెరువు మండలంలో పాల్గొన్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి



బత్తలపల్లి మండలంలో పాల్గొన్న వైసిపి నాయకులు

**ప్రజాశక్తి - నల్లచెరువు**

వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందాయని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని నల్లచెరువు-1 గ్రామ సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో కదిరి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిని సందర్శించి జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు తెలియజేశారు. ప్రభుత్వం అందజేసిన కరపత్రాలను కుటుంబ సభ్యులకు అందజేయడమే కాకుండా వారి మద్దతును కోరాలని తెలిపారు. చంద్రబాబు నాయుడు పాలన, జగన్మోహన్ రెడ్డి పాలనలోని తేడాను వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, ఎంపీడీవో శకుంతల, మండల కన్వీనర్ బట్టి హైదర్ వలి, వైస్ ఎంపీపీ, నారాయణస్వామి, సర్పంచి పంచరత్నమ్మ, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండలం కేంద్రంలోని రెండవ సచివాలయంలో జగన్ ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ మంజుల, మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి , జెడ్పీటీసీ తిరుమల సేవ్ నాయక్, సీనియర్ నాయకులు ఇందుకూరు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచి లక్ష్మి దేవి చంద్రాయుడు, మల్లగుండ్ల భాస్కర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల :** తలుపుల సచివాలయం-2లో మంగళవారం 'ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఫయాజ్ అహ్మద్, రాయలసీమ సేవాదళ్ జోనల్ ఇన్‌ఛార్జి బాబు (కృష్ణారెడ్డి), ఎంపీపీ మహమ్మద్ రఫీ, వేపమానుపేట మాజీ సర్పంచి పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :**జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైసిపితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎంపిపి బగ్గిరి త్రివేణి అన్నారు. బత్తలపల్లి-2 సచివాలయంలో మంగళవారం 'వై ఎపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపిపితో పాటు వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, ఉప సర్పంచి కోటి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తతంగా తీసుకువెళ్లాలని వివరించారు. నిత్యం సచివాలయాల పరిధిలో ప్రజా ప్రతినిధులు, గృహవాలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న చేకూర్చిన లబ్ధిని వివరించాలని సూచించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కోటి సాయి లిపి డిగ్రీ కళాశాల సమీపంలో మా వైసిపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, రాంభూపాల్ రెడ్డి, ప్రతా వీరనారప్ప, నాగభూషణ, కావలి వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

**గాండ్లపెంట :** వైసిపి నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి వైసిపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరించాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించి ఆంధ్ర ప్రదేశ్ కి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హమీద్‌బాష, ఇఒఆర్‌డి సునీత, ఎంపీపీ జగన్మోహన్, వైసీపీ మండల కన్వీనర్ రవీంద్రారెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యుడు ఎస్ ఫయాజ్ ఆలీ, మాజీ జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ఆదర్శనీయమనిఎమ్మెల్యే సిద్దా రెడ్డి అన్నారు .కదిరి రూరల్ మండలం, కాలసముద్రం గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో ఎమ్మెల్యే సిద్దారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విజ్ఞాన కేంద్రాలు గ్రంథాలయాలు





బత్తలపల్లి, సోమందేపల్లి మండలాల్లో నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

**ప్రజాశక్తి - కొత్తచెరువు**

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అనిగ్రంథాలయ అధికారి కే జయరాం తెలిపారు, 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రంథాలయంలో మాజీ ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రాధా లక్ష్మి, సాయి సుశీల, రిటైర్డ్ ఉద్యోగులు మహమ్మద్, కిష్టప్ప, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల :** తలుపుల శాఖ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాల అధికారిణి బి. కమలమ్మ, ఉపాధ్యాయులు శ్రీదేవి , లైబ్రరీ సిబ్బంది కెబి. శ్రీరాములు, గంగిరెడ్డి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** బత్తలపల్లి శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను మంగళవారం ప్రారంభించారు. శాఖ గ్రంథాలయాధికారిణి రాజేశ్వరి ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** గ్రంథాలయ అధికారి మూడే బొజ్జే నాయక్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ సివి నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మల్లాగుండ్ల భాస్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**తనకల్లు :** మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కాక్రమంలో మండల విద్యాశాఖాధికారులు లలితమ్మ, కళ్యాణి, గ్రంథాలయ అధికారి యస్.మస్తాన్ వలి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

**పెనుకొండ :** పట్టణంలోని గ్రంథాలయంలో మంగళవారం ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. అదేవిధంగా నెహ్రూ జయంతి ని పురస్కరించుకొని గ్రంథాలయ అధికారి కె మహబూబ్ బాషా నెహ్రూ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఇంగ్లీష్ టీచర్ షమివుల్లా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు .

**సోమందేపల్లి :** మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో మంగళవారం నెహ్రూ జయంతి సందర్భంగా 56 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె మహబూబ్ బాషా , ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీబాయి, ఉర్దూ స్కూల్ హెచ్‌ఎం తాబూస బేగం, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

**గుడిబండ :** స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో గ్రంథాలయ శాఖ అధికారి కమలనాబారావు ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# నేరాలు ఘోరాలు

### గంజాయి విక్రేతలకు జైలు

**పుట్టపర్తి రూరల్ :** గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డ నేరం రుజువు కావడంతో నిందితులకు ఒక్కొక్కరికి నాలుగు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ ఒకటవ అదనపు జిల్లా జడ్జి, ఫ్యామిలీ కోర్ట్ జడ్జి టి. హరిత మంగళవారం తీర్పు చెప్పారు. 2020 డిసెంబర్ నెల 21వ తేదీ అప్పటి పుట్టపర్తి అర్బన్ పోలీస్ స్టేషన్ సిఐ వెంకటేష్ నాయక్ పుట్టపర్తి నగరంలోని సాయి నగర్ ప్రాంతంలో ముగ్గురు అనుమానితులను చూసి అదుపులోకి తీసుకున్నారు. ఆ ముగ్గురైన శ్రీనివాసులు, హర్షవర్ధన్, రమేష్ చేతుల్లో ఉన్న ప్లాస్టిక్ బ్యాగులను సోదా చేయగా 140 గ్రాములు గంజాయి కన్పించింది. దీంతో వారిని తమదైన శైలిలో విచారించగా అప్పటికే 10 గ్రాముల గంజాయిని విక్రయించామని అంగీకరించారు. దీంతో నిందితులను పెద్ద మనుషుల సమక్షంలో అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. విచారణ అనంతరం వారిపై చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా స్పెషల్ పీపీ లక్ష్మీనారాయణ రెడ్డి ప్రాసిక్యూషన్ తరపున ఐదుగురు సాక్షులను విచారించారు. ఇరు వర్గాల వాదనలు, కేసు పూర్వపరాలు పరిశీలించిన మీదట నిందితులపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఒక్కొక్కరికి నాలుగు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానాకు ఆదేశించారు. ఈ కేసు చేధనలో చొరవ చూపిన పోలీసులను ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

### చిన్నారి కిడ్నాప్ కేసు చేధింపు

**పుట్టపర్తి రూరల్ :** చిన్నారి కిడ్నాప్ కేసును పోలీసులు గంటల వ్యవధిలో చేధించారు. ఈ వివరాలను ఎస్పీ తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. పుట్టపర్తిలోని మోర్ సూపర్ బజార్ సమీపంలో ఆడుకుంటున్న లక్షిత (5)ను సాయికుమార్ అనే యువకుడు కిడ్నాప్ చేశాడు. చాక్లెట్,టపాసులు కొనిస్తానని పాపను తీసుకెళ్ళాడు. పాప కనిపించకపోవడంతో చిన్నారి తల్లిదండ్రులు గిరి నాయక్, అరుణాబాయి పలుచోట్ల గాలించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో చిన్నారి కేసును ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. పుట్టపర్తి డిఎస్‌పి వాసుదేవన్ ఆధ్వర్యంలో, సిఐ కొండారెడ్డి, ఎస్ఐ వీరేశుసీసీటీవీ పుటేజి ఆధారంగా స్థానిక యువకులు, పోలీసుల సాయంతో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నిండితుడు దిక్కు తెలియక చిన్నారిని ప్రశాంతి నిలయం సమీపంలో వదిలిపెట్టి వెళ్లారు. తెల్లవారు జామున పాపను గుర్తించిన పోలీసులు సురక్షితంగా తీసుకొచ్చారు. ఎస్పీ శ్రీ ఎస్వీ మాధవ్ రెడ్డి సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. .ఈ సందర్భంగా ఎస్పీ శ్రీ ఎస్వీ మాధవ్ రెడ్డ మాట్లాడుతూ చిన్నారి కిడ్నాప్ కు గురైందన్న విషయం తెలిసిన వెంటనే రెండుజిల్లాల్లో పోలీసులను అలర్ట్ చేశామన్నారు. దీనికి తోడు యువకులు స్థానిక పోలీసుల సాయంతో పట్టణంలో అణువణువునా గాలింపు చర్యలు చేపట్టి చిన్నారిని సురక్షితంగా పట్టుకోగలిగామని ఎస్పీ వెల్లడించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అశ్రద్ధ వహించవద్దని పిల్లలను జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ ఉండాలని ఎస్పీ సూచించారు. చిన్నారిని కాపాడేందుకు సహకరించిన యువకులను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఈ చిన్నారి కేసులో చాకచక్యంగా వ్యవహరించిన డిఎస్‌పి వాసుదేవన్, సిఐ కొండారెడ్డి ఎస్ఐ వీరేష్, ఇతర పోలీసులను ఎస్పీ మాధవ్ రెడ్డి అభినందించారు.

### రైలు కిందపడి వృద్ధుడు మృతి

**ముదిగుబ్బ :** మండల కేంద్రంలోని పాత ఊరుకు వెళ్లే రైల్వే గేట్ సమీపాన ముదిగుబ్బ ఎస్సీ కాలనీ కు చెందిన వృద్ధుడు ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కాలనీకి చెందిన గుండ్రాళ్ళ గంగన్న (65)కు మతిస్థిమితం లేదని కాలనీవాసులు తెలిపారు. తెల్లవారుజామున కాలకృత్యాలు తీర్చుకోవటానికి రైల్వే లైను మీద వెళుతున్న గంగన్నను రైలు ఢీకొనడంతో మృతిచెందాడని గ్రామస్తులు తెలిపారు.

### అనారోగ్యంతో వైసిపి నాయకుడు మృతి

**ప్రజాశక్తి బత్తలపల్లి**

మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు, ధర్మవరం మాజీ మార్కెట్‌యార్డ్ డైరక్టర్ తప్పెట పెద్దన్న (86) ఆనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచి ఆక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి. జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలలు. వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**గాండ్లపెంట :** చెడ్డిగ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వెంకటనారాయణ సూచించారు. మండల పరిధిలోని రెక్క మాను వద్ద నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం ప్రజలకు ఎస్ఐ చెడ్డి గ్యాంగ్ పట్ల అవగాహన నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలోకి చెడ్డి గ్యాంగ్ ప్రవేశించిందని ఈ నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఒంటరి మహిళ ఎక్కడైనా వెళ్లేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తి పట్ల అనుమానాలు ఉంటే వెంటనే స్థానిక పోలీసులు కానీ డయల్ 100 కానీ ఫోన్ చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసులు శ్రీనివాసులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

### పుట్టపర్తిలో తాగుబోతు హల్‌చల్

**ప్రజాశక్తి పుట్టపర్తి క్రైమ్**

పట్టణంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో తాగుబోతు హల్‌చల్ చేశాడు. టాటా మ్యాజిక్ డ్రైవర్ హరి మంగళవారం పూటుగా మద్యం సేవించి ఆర్టీసీ బస్సు డ్రైవర్ హారన్ కొట్టాడని నడిరోడ్లో బస్సును ఆపి డ్రైవర్‌నుకొట్టబోయాడు. పోలీసులు వచ్చి సర్ది చెప్పిన వినకుండా నడిరోడ్డులో బస్సును ఆపి బస్సు ముందు పడుకుని వీరంగం సృష్టించాడు. దాదాపు గంటసేపు ఈ తతంగం నడిచింది. పోలీసులను కూడా దుర్భాషలాడి చుట్టుపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాడు. అనంతరం ఆయన భార్య బంధువులు వచ్చి ఆటోలో ఎక్కించుకొని ఇంటికి తీసుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

### వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి : టిడిపి

**ప్రజాశక్తి మడకశిర**

వైసిపి నాయకులు వాస్తవాలు తెలుసుకొని నోరు అదుపులో పెట్టుకున మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడారు. టిడిపి నాయకులపై పనికట్టుకుని ఆరోపణలు చేయడం వైసిపి నాయకులు మానుకోవాలని హితవు పలికారు. ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలించే నాయకులైతే ప్రజలవద్దకు వెళ్లి తేల్చుకుందామని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు మనోహర్, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ ,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు భక్తర్ సాబ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, ఐటిడిపి తాలూకా అధ్యక్షులు కాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

### చెడు మార్గాలకు దూరంగా ఉండాలి

**పుట్టపర్తి క్రైమ్ :** విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండాలని బాలల సంరక్షణ విభాగం డిసిపిఒ వెంకటేశ్వరి, ఐసిడిఎస్ పీడీ లక్ష్మి కుమారి పేర్కొన్నారు. మంగళవారం బాలల దినోత్సవం, దత్తత మాసోత్సవం పురస్కరించుకొని చిన్న పల్లి ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ, పోలీస్, సెబ్ వారితో కలసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు సిఐ కొండారెడ్డి, సెబ్ సిఐ మాధవి, గాయత్రి తదితరులు మాట్లాడుతూ మత్తు పదార్థాల ప్రభావం విద్యార్థుల పైన పిల్లలపైన పడకుండా విద్య యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ రెడ్డప్ప, ఎస్జీవో కోఆర్డినేటర్ ఎల్లప్ప, పాఠశాల హెచ్‌ఎం ప్రభావతి, బిసిపియు సిబ్బంది నాగలక్ష్మి, వెంకట కుమార్, వసంత, రమాదేవి, హెల్ప్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

### హోటల్ ప్రారంభం

**కదిరి టౌన్ :** పట్టణంలోని గర్ల్స్ కాలేజ్ ఎదురుగా తాయి లాడ్జ్‌లో టిడిపి కౌన్సిలర్ సావిత్రమ్మ కుమారులు రాజశేఖర్ అధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ద్వారక గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి కందికుంట యశోద దేవి ప్రారంభించారు. హోటల్ నిర్వాహకులు రుచికరమైన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆమె కోరారు.

### బాధితురాలికి ఆర్థికసాయం

**ప్రజాశక్తి ధర్మవరం టౌన్**

పట్టణంలోని యాస్మిన్ శారీసెంటర్ నిర్వాహకురాలు యాస్మీన్ కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న పట్టణంలోని టెక్స్‌టైల్స్ అండ్ గార్మెంట్స్ అసోసియేషన్ సభ్యులు ఆర్థికసాయం అందజేశారు. వారందరూ విరాళాలు వేసుకున్న సేకరించిన నగదు రూ. 50వేలను మంగళవారం ఆస్పత్రికి వెళ్లి బాధితురాలికి అందజేశారు.



పుట్టపర్తిలో విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న ఎంఇఒలు


ముదిగుబ్బలోని పివిఎస్ పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు


మడకశిరలో విద్యార్థులతో ముచ్చటిస్తున్న రఘువీరారెడ్డి

# ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

**ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్**

విద్యార్థులు వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు ప్రసాద్, ఖాదర్ వలీ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని జగరాజు పల్లి లోని మంగళకర ఎడ్యుకేషనల్ ట్రస్టులో జరిగిన బాలల దినోత్సవం లో పాల్గొన్న వారు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు ఆటలలో కూడా రాణించాలన్నారు. మంగళకర ట్రస్టు గత 30 ఏళ్లుగా అనాథ పిల్లలకు అంకితభావంతో విద్యను అందిస్తూ వారి భవిష్యత్తుకు బంగారు భవిష్యత్తును కల్పిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ ఘనపరిచిన విద్యార్థులకు ట్రోఫీతో పాటు ప్రశంస పత్రాలను బహుకరించారు. ఈ కార్యక్రమంలో మంగళకర ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ సురేష్ కుమార్, ఆర్య ప్రకాష్, బిందు, ప్రిన్సిపాల్ జయచంద్ర రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మడకశిర :** మండలంలోని జిల్లేడుగుంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. భూతన్న ఆధ్వర్యంలో ఆ పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి. సుధారాణి, ఆర్. సునిత, జి. కరియన్న, శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ముదిగుబ్బ :** మండల కేంద్రంలోని పివిఎస్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ పివి నాయుడు భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా నవంబర్ 14న దేశ వ్యాప్తంగా బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఈసందర్భంగా పలువురు విద్యార్థులు నెహ్రూ వేషధారణలో వచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పివి నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**బత్తలపల్లి :** స్థానిక శ్రీజ్యోతి హై స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు నెహ్రూ వేషధారణలతో వచ్చి అలరించారు. ఈ కార్యక్రమములో జ్యోతి హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, డైరెక్టర్ ధర్మతేజు, ఉపాధ్యాయులు నాగ పెద్దిరాజు, శంకరయ్య, రమేష్, కాటమయ్య, మూర్తి, వెంకటపతి, లక్ష్మి, షబాన తదితరులు పాల్గొన్నారు.

**తలుపుల :** మండలంలోని కొరుకుట్టపల్లి అంగన్వాడీ కేంద్రం నందు అంగన్వాడి టీచర్ రామకుమారి ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు వేణుగోపాల్ తదితరులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

**పెనుకొండ :** పట్టణంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో మంగళవారం జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని బాలల దినోత్సవ వేడుకలను పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు చంద్ర శేఖర్,సుధాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఇఒలు మాట్లాడుతూ జవహర్ లాల్ నెహ్రూ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్ రెడ్డి, హెడ్ మిస్టస్ అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని ప్రగతి, గ్లోబల్ జెన్ పాఠశాలల్లో మంగళవారం బాలల దినోత్సవ వేడుకలను పాఠశాలల కరస్పాండెంట్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలో ప్రధానోపాధ్యాయురాలు మంజువాణి , డైరెక్టర్స్ సాయి సృజన, సాయి శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మడకశిర రూరల్ :** మడకశిర మండలం పట్టణంలో గ్రంథాలయం వద్ద మంగళవారం గ్రంథాలయ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా బాలల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ రావు హాజరయ్యారు. నెహ్రూ జయంతి వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

**లేపాక్షి :** మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాల శ్రీ మార్గదర్శి విద్యాలయంలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో కేక్ కట్ చేసి పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మడకశిర :** బాలల దినోత్సవం కార్యక్రమంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని నీలకంఠాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెహ్రూ జయంతి సందర్భంగా మంగళవారం జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమానికి హాజరైన రఘువీరారెడ్డి మాట్లాడుతూ నేటి బాల బాలికలే రేపటి పౌరులని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిలమత్తూరు :** మండల వ్యాప్తంగా మంగళ వారం ఘనంగా చిల్డ్రన్స్ డే నిర్వహించారు.ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.గ్రంథాలయ వారోత్సవాలలో బాగంగా చిలమత్తూరు శాఖ గ్రంథాలయంలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రంథాలయ శాఖ అదికారి మల్లికార్జున, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**ధర్మవరం టౌన్ :** పట్టణంలోని విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో బాలల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విశ్వ భారతి స్కూల్ చైర్మన్ రిజ్వాన్‌బాషా, ప్రిన్సిపాల్ రమణ, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో కరీముల్లా తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


**ధర్మవరం టౌన్ :** మండల పరిధిలోని నాగలూరు వద్ద ఉన్న రూపారాజా పిసిఎంఆర్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపారాజా క్రిష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కదిరి టౌన్ :** భారత మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణం లోని జోకుపాళ్యం స్కూల్ నందు బాలల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులు సిడిపిఒ రాధిక, సూపర్‌వైజర్ మమత నెహ్రు చిత్రపటానికి చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**హిందూపురం :** నెహ్రూ జయంతిని పురష్కరించుకుని మంగళవారం పట్టణంలోని వివిధ పాఠశాల, కళాశాలల్లో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. పాంచజన్య పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు శ్రీనివాసులు, నందకుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. ఆల్‌ఆమీన్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ రియాజ్, హెచ్‌ఎం న్యామతున్నీసా, వివేకానంద మిలీనియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ బైసానిరాంప్రసాద్, రినౌల్డ్ ఇంగ్లీష్ మీడియంలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు ముస్తఫా అలీఖాన్, హెచ్‌ఎం బీబీ జాన్, మనస్వీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ మల్లికార్జున, హెచ్‌ఎం నాగరత్న పాల్గొన్నారు. అదే విధంగా బాలయేసులో జరిగిన కార్యక్రమంలో వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, శారద, ప్రతాప్‌రెడ్డి, సువర్ణభారతి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నీలకంఠరెడ్డి, అనీల్ కుమార్, దీప్తి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అబ్రహీమ్ కుట్టి అంకుల్, దీపు, లూసి, వేణు విద్యావిహార్‌లో జరిగిన కార్యక్రమంలో అద్యక్షులు వేణుగోపాల్‌లు పాల్గొన్నారు. నారాయణ పాఠశాలలో నిర్వహించిన సాంస్కృతికకార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులు ఫ్యాన్సీ డ్రెస్, భరతనాట్యం, కోలాటం వంటి ముత్యాలతోపాటు చిన్నారులు ఇచ్చిన వివిధ సందేశాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. నారాయణ ఈ టెక్నో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఏజీఎం రమేష్ బాబు, ప్రిన్సిపల్ రాజేష్ కుమార్, ఎఒ నవీన్ కుమార్, అకాడమిక్ డీన్ పరమేష్, వైస్ ప్రిన్సిపాల్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు. నారాయణ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివకుమార్, ఎఒ ముత్యలన్న, వైస్ ప్రిన్సిపల్ అశోక్‌కుమార్, శిల్పవాణి, తస్వీన్, రేణుక దేవి తదితరులు పాల్గొన్నారు..

**గుడిబండ :** మండల పరిధిలోని మందలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా బాలల దినోత్సవ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆటల పోటీలలో వ్యాసరచన, వక్రత, బొమ్మలు గీయడం, అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆదినారాయణ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, సోమశేఖర్, రవి, కదిరప్ప, సన్న హనుమంతప్ప, రామచంద్రప్ప, సోమశేఖర, ఉపాధ్యాయురాలు నవీనా బేగం తదితరులు పాల్గొన్నారు.

**మడకశిర :** పట్టణంలోని కెపి స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస భాస్కర్, కౌన్సిలర్ అన్సార్ ఖాన్, మాజీ కౌన్సిలర్ సి.నారాయణప్ప, కెంపన్న, గంగాధరప్ప, రంగనాథ్, సురేష్ , 17వ వార్డు కౌన్సిలర్ .సుభద్ర నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.


మడకశిరలో కేక్ కట్ చేస్తున్న ప్రజాప్రతినిధులు


హిందూపురంలో వ్యాసరచన పోటీలు రాస్తున్న విద్యార్థులు


పెనుకొండలో బాలల దినోత్సవ వేడుకలు